సీఎంకు కోమటిరెడ్డి మోహన్‌రెడ్డి వినతి

నార్కట్‌పల్లి: మండలంలోని బ్రాహ్మణ వెల్లెంల గ్రామానికి వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డికి గోపలాయపల్లి శ్రీవారిజాల వేణుగోపాలస్వామి ఆలయ అనువంశిక చైర్మన్ కోమటిరెడ్డి మోహన్‌రెడ్డి వినతిపత్రం అందజేశారు. దేవాలయంలో శంకర మఠం, శంకరాచార్యమూర్తి, శిల్పకళాశాస్త్ర పాఠశాలను ప్రభుత్వం ఏర్పాటు చేయాలని కోరారు. ఈ సందర్భంగా దేవస్థానం ప్రాశస్త్యానికి సంబంధించిన పలు విషయాలను వివరించారు.

సీపీఎం నాయకుల వినతి

నల్లగొండ టౌన్ : పట్టణంలోని పలు సమస్యలపై సీపీఎం నాయకులు సీఎం రేవంత్‌రెడ్డికి శనివారం వినతిపత్రం అందజేశారు. పట్టణానికి అవుటర్ రింగ్ రోడు, నల్లగొండ అభివృద్ధికి నిధులు కేటాయించాలని కోరినట్లు వారు తెలిపారు. లాటరీ ద్వారా ఎంపిక చేసిన 552మంది లబ్ధిదారులకు ఇళ్ల పంపిణీ, ఇళ్లకు అన్ని సౌకర్యాలు కల్పించాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యులు ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, తుమ్మల వీరారెడ్డి, సయ్యద్ హాశం, సత్తయ్య, సలీం ఉన్నారు.

సీఎం కోసం తెచ్చిన ఫుడ్ ఐటెమ్స్ తనిఖీ

నార్కట్‌పల్లి: మండలంలోని బ్రాహ్మణ వెల్లెంలకు సీఎం రేవంత్‌రెడ్డి వస్తున్న సందర్భంగా ఆయన తినేందుకు తెచ్చిన పండ్లు, బిస్కెట్లు, డ్రైఫ్రూట్స్ (ఫుడ్ ఐటెమ్స్)ను జిల్లా ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు తనిఖీ చేశారు. వాటిలో యాపిల్స్, కాజూ నాణ్యతగా లేవని నిరాకరించారు. అయితే ముందుగా ఫుడ్ ఐటెమ్స్‌ను తనిఖీ చేయడానికి ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు జ్యోతిర్మయి, స్వాతి నేరుగా హెలిపాడ్ వద్దకు వెళ్తుండగా అక్కడ బందోబస్తులో ఉన్న పోలీసులు వారిని అనుమతించలేదు. తనిఖీ పాయింట్ నుంచి వెళ్లాలని అడ్డుకున్నారు. ఈ క్రమంలో ఇరువురి మధ్య కొద్దిసేపు వాగ్వాదం జరిగింది. అనంతరం పోలీసులు అనుమతించడంతో ఫుడ్ అధికారులు హెలిపాడ్ వద్దకు వెళ్లి పండ్లు, బిస్కెట్లు, డ్రైఫ్రూట్స్‌ను క్షుణ్ణంగా తనిఖీ చేశారు.


ఫుడ్ ఐటెమ్స్‌ను పరిశీలిస్తున్న ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు

క్లుప్తంగా

చెర్వుఅన్నారం వాసికి జియాలజీలో డాక్టరేట్



కట్టంగూర్ : మండలంలోని చెర్వుఅన్నారం గ్రామానికి చెందిన రెడ్డిమళ్ల శంకర్ ఉస్మానియా యూనివర్సిటీలో జియాలజీ విభాగంలో డాక్టరేట్ పొందాడు. ఉస్మానియా యూనివర్సిటీ డిపార్ట్‌మెంట్ ఆఫ్ జియాలజీ రిటైర్డ్ ప్రొఫెసర్ ఏ.నర్సింగరావు పర్యవేక్షణలో రిసోర్స్ ఎవాల్యుయేషన్ ఇన్ రిలేషన్ టూ ఎక్స్‌పాలిటేషన్ ఆఫ్ లైమ్‌స్టోన్ డిపాజిట్స్ విభాగంలో కర్ణాటకలోని బాగల్‌కోట్ జిల్లాలో సున్నపు రాయి నిక్షేపాల అన్వేషణకు సంబంధించి వనరుల మూల్యాంకనంపై పరిశోధన పూర్తి చేశాడు. పూర్తి చేసిన పరిశోధన గ్రంథాన్ని ఉస్మానియా యూనివర్సిటీ ఎగ్జామినేషన్ బ్రాంచ్ అధికారులు పరిశీలించి శనివారం హైదరాబాద్‌లో పీహెచ్‌డీ పట్టా అందజేసినట్లు ఆయన తెలిపారు.

ఘనంగా సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కల్యాణం

నార్కట్‌పల్లి : మండలంలోని చెర్వుగట్టు సమీపంలో గల సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో శనివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు శ్రీదౌలతాబాద్ వాసుదేవ్‌శర్మ ఆధ్వర్యంలో స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నూకల నర్సింహారెడ్డి, తెరట్టుపల్లి హనుమంతు, జయారపు రామకృష్ణ, వెంకటేష్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

మునుగోడు : తమతో పాటు విద్యాభ్యాసం చేసి అనారోగ్యంతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న తోటి స్నేహితురాలికి శనివారం తోటి స్నేహితులు ఆర్థికసాయం అందజేశారు. సంస్థాన్‌నారాయణపురం మండలంలోని గుజ్జ గ్రామానికి చెందిన మంగలి లింగమ్మ గుండె, ఇతర వ్యాధితో బాధపడుతుండడంతో మండలంలోని కోతులారం గ్రామానికి చెందిన తోటి స్నేహితులు రూ.50వేల ఆర్థికసాయం అందించారు. ఆర్థిక సాయం అందించిన వారిలో స్నేహితులు కోతులారం గ్రామ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కందుల జగదీష్, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ సతీమణి అనిత తదితరులు ఉన్నారు.

బీజేపీ బూత్ కమిటీల ఎన్నిక

చండూరు : మున్సిపల్ కేంద్రంలో శనివారం బీజేపీ ముఖ్యకార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు పందుల సత్యంగౌడ్ అధ్యక్షతన రాష్ట్ర ఓబీసీ మోర్చా అధికార ప్రతినిధి కోమటి వీరేశం ఆధ్వర్యంలో శనివారం నూతన బూత్ కమిటీలను ప్రకటించారు. అనంతరం వారికి నియామకపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో శివ, నాగారాజు, చంద్రమౌళి ఉన్నారు.


గోపలాయిపల్లి దేవాలయం ఫొటోను సీఎంకు బహుకరిస్తున్న కోమటిరెడ్డి బ్రదర్స్


సీఎం, డిప్యూటీ సీఎంలను తలపాగాతో సన్మానిస్తున్న గుమ్మల మోహన్‌రెడ్డి


సభలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ బుర్రి


సీఎంకు స్వాగతం పలుకుతున్న కలెక్టర్, ఎస్పీ


సెట్విన్ శిక్షణ కేంద్రానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి కోమటిరెడ్డి, చిత్రంలో ఎమ్మెల్యేలు, కలెక్టర్


బ్రాహ్మణవెల్లెంల పైలాన్‌ను ఆవిష్కరిస్తున్న సీఎం, డిప్యూటీ సీఎం, మంత్రులు, ఎమ్మెల్యేలు


సభలో ఏపూరి సోమన్న బృందం ఆటాపాట


సీఎంతో మాట్లాడుతున్న గుత్తా

బ్ర. వెల్లెంలలో 35 నిమిషాలు..

నార్కట్‌పల్లి, చిట్యాల : నార్కట్‌పల్లి మండలంలోని బ్రాహ్మణవెల్లెంల గ్రామంలో బ్రాహ్మణవెల్లెంల – ఉదయసముద్రం లిఫ్ట్ ఇరిగేషన్ స్కీం కింద నిర్మించిన డెలివరీ చానల్స్‌ను శనివారం సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించారు. ముందుగా ప్రకటించిన షెడ్యూల్ సమయం కంటే సీఎం 55 నిమిషాలు ఆలస్యంగా వచ్చారు. ఇక్కడ 35 నిమిషాల సమయం కేటాయించారు.

- హైదరాబాద్ నుంచి ముఖ్యమంత్రి వెంట హెలికాప్టర్‌లో డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వచ్చారు. బ్రాహ్మణవెల్లెంల హెలిపాడ్ వద్ద వారికి మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎంపీ, ఎమ్మెల్యేలు స్వాగతం పలికారు.
- చెర్వుగట్టు అర్చకులు పోతులపాటి రామలింగేశ్వర శర్మ, దామోదర్‌శర్మ, రాఘవశర్మ పూర్వకుంభంతో స్వాగతం పలికి ప్రత్యేక పూజలు చేశారు.
- సీఎం రేవంత్‌రెడ్డిని చూసేందుకు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, పెద్ద ఎత్తున తరలివచ్చారు.
- ప్రారంభోత్సవం స్థలం వద్దకు ముందుగా రూపొందించిన జాబితాలోని వారిని మాత్రమే పోలీసులు అనుమతించారు. కొందరు స్థానిక ప్రజాప్రతినిధులు, మీడియా ప్రతినిధులను అనుమతించకపోవటంతో పలువురు నిరసన తెలిపారు.
- సీఎం పర్యటన బందోబస్తు కోసం వచ్చిన పోలీసు సిబ్బందికి భోజనం, మంచినీటి ఏర్పాట్లు చేయకపోవటంతో పలువురు పోలీసులు ఇబ్బంది పడ్డారు.
- సీఎం రేవంత్‌రెడ్డి బ్రాహ్మణవెల్లెంల ప్రాజెక్టు వద్ద ఎలాంటి ఉపన్యాసం చేయకపోవటంతో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు నిరుత్సాహానికి గురయ్యారు.

ఏనుగు లక్ష్మమ్మకు పలువురి నివాళి


నర్సింహారెడ్డిని పరామర్శిస్తున్న చెరుపల్లి సీతారాములు, గుత్తా అమిత్‌రెడ్డి తదితరులు

చిట్యాల : పట్టణానికి చెందిన ప్రముఖ సాహితీవేత్త ఏనుగు నర్సింహారెడ్డి తల్లి లక్ష్మమ్మ(90)అనారోగ్యంతో శుక్రవారం రాత్రి మృతి చెందింది. శనివారం ఆమె మృతదేహాన్ని శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, డెయిరీ చైర్మన్ గుత్తా అమిత్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే నంద్యాల నర్సింహారెడ్డి, సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు చెరుపల్లి సీతారాములు, రాష్ట్ర కమిటీ సభ్యుడు ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, చిట్యాల మున్సిపల్ చైర్మన్ కోమటిరెడ్డి చినవెంకట్‌రెడ్డి, సీపీఎం నాయకుడు జిట్ట నగేష్, అవిశెట్టి శంకరయ్య వేర్వేరుగా సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏనుగు నర్సింహారెడ్డిని పలువురు పరామర్శించి, తమ సానుభూతిని తెలిపారు.

బీజేపీ, బీఆర్‌ఎస్ నాయకుల ముందస్తు అరెస్ట్


నల్లగొండ టూటౌన్ : రూరల్ పోలీస్‌స్టేషన్ ఎదుట ఉన్న బీఆర్‌ఎస్ నాయకులు


నకిరేకల్ పోలీస్‌స్టేషన్‌లో నిరసన తెలుపుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

నల్లగొండ టూటౌన్ : సీఎం రేవంత్‌రెడ్డి జిల్లా పర్యటన సందర్భంగా బీఆర్‌ఎస్ మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డిని శనివారం ముందస్తుగా పోలీసులు హౌజ్ అరెస్ట్ చేశారు. బీఆర్‌ఎస్ శ్రేణులతో కలిసి సీఎం రేవంత్‌రెడ్డికి వినతిపత్రం అందిస్తానని ఆయన ముందుగానే ప్రకటించడంతో పోలీసులు హౌజ్ అరెస్ట్ చేయగా, మున్సిపల్ మాజీ చైర్మన్ మందడి సైదిరెడ్డి, నాయకులు మారగోని గణేష్, పట్టణానికి చెందిన మరి కొంతమంది నాయకులను పోలీసులు అరెస్ట్ చేసి నల్లగొండ రూరల్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

తిప్పర్తి : సీఎం రేవంత్‌రెడ్డి నల్లగొండ పర్యటన సందర్భంగా శనివారం బీజేపీ, బీఆర్‌ఎస్ నాయకులను ముందస్తుగా అరెస్టు చేశారు. ఈ సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షుడు పల్లే ప్రకాశ్, బీఆర్‌ఎస్ నాయకులు కందుల లక్ష్మయ్య మాట్లాడారు. అరెస్టులతో ప్రతిపక్షాల గొంతు నొక్కడం సరికాదన్నారు. ఆరు గ్యారంటీలు అమలు చేయకుండా ప్రజాపాలన సంబరాలు చేయడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు సందీప్‌రెడ్డి, మైనం నాగయ్య, పూజర్ల రాజు, బీజేపీ నాయకులు మధు, సతీష్, శివ, సంపత్ పాల్గొన్నారు.

బీఎస్పీ నాయకుల అరెస్ట్

చిట్యాల : నార్కట్‌పల్లి మండలంలోని బ్రాహ్మణవెల్లెంల ఉదయసముద్రం ప్రాజెక్టు ప్రారంభోత్సవానికి సీఎం రేవంత్‌రెడ్డి శనివారం వస్తున్న నేపథ్యంలో పలువురు బీఆర్‌ఎస్, బీఎస్పీ పార్టీ నాయకులను మండల పోలీసులు ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారు. వారిని పోలీస్‌స్టేషన్‌కు తరలించి సాయంత్రం వ్యక్తిగత పూచికత్తుపై విడుదల చేశారు. అరెస్ట్ అయిన వారిలో మున్సిపల్ వైస్‌చైర్మన్ కూరెళ్ల లింగస్వామి, బీఆర్‌ఎస్ నాయకులు కోనేటి ఎల్లయ్య, అశోక్, గణేష్, కృష్ణ, నగేష్, బీఎస్పీ నాయకుడు గ్యార మారయ్య ఉన్నారు.

నకిరేకల్ : తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి నల్లగొండ జిల్లా పర్యటన నేపథ్యంలో శనివారం బీఆర్‌ఎస్ నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అక్రమ అరెస్ట్‌ను నిరసిస్తూ బీఆర్‌ఎస్ నాయకులు పోలీస్‌స్టేషన్‌లో నిరసన తెలిపారు. అరెస్ట్ అయిన వారిలో మున్సిపల్ మాజీ చైర్మన్ రాచకొండ శ్రీనివాస్‌గౌడ్, రాచకొండ వెంకన్నగౌడ్, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

విద్యార్థులు చెడు వ్యసనాల బారినపడొద్దు

చిట్యాల : యువత, విద్యార్థులు చెడు వ్యసనాల బారినపడొద్దని, డ్రగ్స్, మద్యం లాంటి వాటికి అలవాటు పడి తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారని ఐద్వా జిల్లా కార్యదర్శి పాలడుగు ప్రభావతి అన్నారు. శనివారం పట్టణంలోని జెడ్పీహెచ్ఎస్ ఐద్వా ఆధ్వర్యంలో 'ఆడపిల్లల భద్రత–మనందరి బాధ్యత' అనే అంశంపై నిర్వహించిన సెమినార్‌లో ఆమె పాల్గొని మాట్లాడారు. యువత చెడు వ్యసనాలను విడనాడి చైతన్యవంతులై విభిన్న రంగాలలో రాణించాలన్నారు. ఆడపిల్లలపై జరుగుతున్న అత్యాచారాలను, మహిళల హత్యలను అరికట్టాల్సిన బాధ్యత పాలకులపై ఉందన్నారు. గ్రామాల్లో సెమినార్లు నిర్వహించి ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కమిటీ సభ్యురాలు జిట్ట సరోజ, ఎంఈఓ సైదానాయక్, ఉపాధ్యాయురాలు పద్మజ, మంజుల, శైలజ, ఉపాధ్యాయుడు శ్రీనివాస్, విద్యార్థినులు పాల్గొన్నారు.



సెమినార్‌లో మాట్లాడుతున్న ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి పాలడుగు ప్రభావతి

ఆర్థిక ఇబ్బందులతో మహిళ ఆత్మహత్య

శాలిగౌరారం: ఆర్థిక ఇబ్బందులతో ఉరేసుకుని మహిళ ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన శాలిగౌరారం మండలం అంబారిపేట గ్రామంలో శనివారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అంబారిపేట గ్రామానికి చెందిన నూనె శేఖర్‌కు అడ్డగూడూరు మండలం గట్టుసింగారం గ్రామానికి చెందిన అనూషతో 12 సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. శేఖర్ కేవలం గొర్రెలను పెంచి పోషించడమే తప్ప కుటుంబ బాధ్యతలను చూసుకోకపోవడంతో ఆ భారం అనూష మీద పడింది. దీంతో పాటు కొంతకాలంగా కుటుంబంలో ఆర్థిక ఇబ్బందులు తలెత్తాయి. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం శేఖర్ గొర్రెలు మేపేందుకు, కుమారులు పాఠశాలకు వెళ్లారు. ఇంట్లో ఒంటరిగా ఉన్న అనూష ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. సాయంత్రం బడి నుంచి ఇంటికి వచ్చిన కుమారులు తలుపులు కొట్టగా గడియ పెట్టి ఉండటంతో కిటికీలోంచి చూడగా.. అనూష ఉరికి వేలాడుతూ కనిపించింది. దీంతో కుమారులు గట్టిగా కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు వచ్చి తలుపులు పగలగొట్టి అనూషను కిందకు దించి చూడగా అప్పటికే ఆమె మృతిచెందింది. శనివారం మృతురాలి తండ్రి కడారి కొమరయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నకిరేకల్ ప్రభుత్వాస్పత్రికి తరలించి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ నజీరుద్దీన్ తెలిపారు. గ్రామానికి చెందిన ఓ రాజకీయ నాయకుడి సోదరుడి కుమారుడు మృతురాలి కుటుంబంతో సన్నిహితంగా ఉండేవాడని, అనూష మృతిచెందిన మరుక్షణం నుంచి గ్రామంలో అతడి కుటుంబం కనిపించడం లేదని గ్రామస్తులు తెలిపారు.

తెలంగాణ తల్లి విగ్రహాన్ని పేదరాలిగా చూపించడం తగదు

మర్రిగూడ : తెలంగాణ తల్లి విగ్రహాన్ని పేదరాలిగా చూపించడం తగదని, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం తెచ్చిన మార్పు ఇదేనా అని బీఆర్‌ఎస్ నాయకుడు బచ్చు రామకృష్ణ అన్నారు. శనివారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ ఉద్యమ సమయంలో సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా ఉన్న తెలంగాణ తల్లిని ఊరూరా ఏర్పాటు చేసుకున్నామని, కాని ప్రస్తుతం తెలంగాణ తల్లిని కాంగ్రెస్ ప్రభుత్వం పేదరాలిగా చూపించడం సరికాదన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం డైవర్షన్ రాజకీయాలు మానుకొని ప్రజల ఆత్మగౌరవాన్ని కాపాడాలన్నారు.

కేటీఆర్‌ను కలసిన బీఆర్‌ఎస్ నాయకులు

నార్కట్‌పల్లి : బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారకరామారావును శనివారం హైదరాబాద్‌లో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రేగట్టె మల్లిఖార్జున్‌రెడ్డి, మాజీ ఎంపీపీ సూదిరెడ్డి నరేందర్‌రెడ్డి కలిశారు. ఈ సందర్భంగా వారు బ్రాహ్మణవెల్లంల ప్రాజెక్టు నిర్మాణానికి సంబంధించి పలు విషయాలు ఆయనకు వివరించినట్లు తెలిపారు.

కొనసాగుతున్న సమగ్ర శిక్షా ఉద్యోగుల దీక్ష

కట్టంగూర్ : విద్యాశాఖలో పనిచేస్తున్న సమగ్ర శిక్షా ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని కోరుతూ శనివారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఆ సంఘం ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ఈ దీక్షకు టీఎస్ యూటీఎఫ్ జిల్లా ఆడిట్ కమిటీ సభ్యుడు మిట్టపల్లి మురళయ్య, మండల అధ్యక్షుడు పుట్ట రాములు మద్దతు తెలిపి మాట్లాడారు. కార్యక్రమంలో పీటీఐ ఐతగోని సైదులు, సీఆర్‌పీ నాగేష్, రామలింగం, లక్ష్మణ్, స్వప్న, అశ్విని, మాధవి, సంతోష తదితరులు ఉన్నారు.

తిప్పర్తి : విద్యాశాఖలో పనిచేస్తున్న సమగ్ర శిక్షా ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని కోరుతూ శనివారం రెండో రోజు మండల కేంద్రంలోని ఎమ్మార్సీ భవనం ఎదుట నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలో వచ్చిన వెంటనే రెగ్యులరైజ్ చేస్తామని రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారని, హామీకి కట్టుబడి వెంటనే రెగ్యులరైజ్ చేయాలని కోరారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఉద్యోగులు కొండయ్య, సత్యనారాయణ, పుష్పలత, శ్రీదేవి ప్రసాద్ పాల్గొన్నారు.

చండూరు(గట్టుప్పల్) : విద్యాశాఖలో పనిచేస్తున్న సమగ్ర శిక్షా కాంట్రాక్టు ఉద్యోగులను వెంటనే రెగ్యులరైజ్ చేయాలని ఆ ఉద్యోగుల సంఘం మండల అధ్యక్షుడు సాయిలు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన రిలే దీక్షలు శనివారం రెండో రోజు కొనసాగాయి. దీక్షలకు పీఆర్‌టీయూ టీఎస్ మండల అధ్యక్షుడు ఎడ్ల భిక్షం, ప్రధాన కార్యదర్శి మాదగాని వెంకటేశ్వర్లు, అసోసియేట్ అధ్యక్షుడు కట్లం వెంకట్‌రెడ్డి, రాష్ట్ర బాధ్యులు నర్సింహారావు, టీపీయూపీఎస్ మండల అధ్యక్షుడు దోటి కిషన్‌ప్రసాద్, ప్రధాన కార్యదర్శి బాలస్వామి, వీరేశం సంఘీభావం తెలిపారు.

ఉద్యోగుల దీక్షకు మద్దతు

చిట్యాల : సమగ్ర శిక్షా కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ మండల కేంద్రంలో ఎమ్మార్సీ భవనం ఎదుట ఆ సంఘం ఉద్యోగులు చేపట్టిన రిలే నిరాహార దీక్ష శనివారం రెండో రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షకు పీఆర్‌టీయూ టీఎస్ మండల అధ్యక్షుడు కంచర్లకుంట్ల సుధాకర్‌రెడ్డి, టీఎస్ యూటీఎఫ్ మండల అధ్యక్షుడు ఏశమల్ల నాగయ్య మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. సమగ్ర శిక్షా కాంట్రాక్టు ఉద్యోగులకు ఇచ్చిన హామీ మేరకు పేస్కేల్‌ను ఇచ్చి రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. దీక్షలో ఉద్యోగులు వరలక్ష్మి, సరిత, ప్రవళిక, జయకాంత్, తిరుమలమ్మ, టీఎస్ యూటీఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి సతీష్, పీఆర్‌టీయూ టీఎస్ జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు చిలకరాజు శ్రీనివాస్, మండల ఉపాధ్యక్షుడు నకిరేకంటి సైదులు, అంబటి సత్తయ్య, పద్మజ, శైలజ, కవిత, మంజుల, శంకరయ్య, సరిత, వెంకటేశ్వర్లు, శారద పాల్గొన్నారు.

శాలిగౌరారం : తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మండల సమగ్ర శిక్షా ఉద్యోగులు స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఎదుట చేపట్టిన రిలే నిరాహార దీక్ష శనివారం రెండోరోజుకు చేరుకుంది. దీక్షలో సంఘం జిల్లా అధ్యక్షుడు మొలుగూరి కృష్ణ పాల్గొని మాట్లాడారు. సమగ్ర శిక్షా ఉద్యోగులందరిని క్రమబద్ధీకరించాలని, వారందరికి జీవిత బీమా, ఆరోగ్య బీమా సౌకర్యం కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఉద్యోగుల సంఘం ప్రతినిధులు, ఉద్యోగులు చంద్రశేఖర్, నాగయ్య, రేణుక, పరమేశ్, శేఖర్, నాగరాణి, సవిత, అనురాధ, కోటమ్మ, రాములమ్మ, సుజాత, భిక్షమయ్య, గీత వెంకటమ్మ తదితరులు పాల్గొన్నారు.


కట్టంగూర్ : ఎంపీడీఓ కార్యాలయంలో దీక్ష చేస్తున్న ఉద్యోగులు


తిప్పర్తి : ఎమ్మార్సీ భవనం ఎదుట ధర్నా చేస్తున్న ఉద్యోగులు


చిట్యాల : దీక్షకు మద్దతు తెలుపుతున్న పీఆర్‌టీయూ, యూటీఎఫ్ ప్రతినిధులు


చండూరులో కొనసాగుతున్న రిలే దీక్ష

70 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం

మర్రిగూడ : సారా తయారీకి ఉపయోగించే బెల్లం పానకం స్థావరాలపై శనివారం నాంపల్లి ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని సరంపేటతండా, అజ్జిలా పురం గ్రామాల్లో సారా తయారీ స్థావరాలపై దాడి నిర్వహించి 70లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేసినట్లు నాంపల్లి ఎక్సైజ్ సీఐ సైదులు తెలిపారు. గ్రామాల్లో సారాను తయారు చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట ఎక్సైజ్ సిబ్బంది నాగరాజు, అశోక్‌కుమార్, నాగేశ్వర్‌రావు, జాని, సిబ్బంది పాల్గొన్నారు.


బెల్లం పానకాన్ని ధ్వంసం చేస్తున్న ఎక్సైజ్ పోలీసులు

వాటర్ ఫిల్టర్ బహూకరణ

మర్రిగూడ : మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయానికి మండల కేంద్రానికి చెందిన యాచారం జితేంద్రగిరి శనివారం వాటర్ ఫిల్టర్‌ను బహూకరించారు. కార్యక్రమంలో డీటీ జూటూరు తారకరామన్, సిబ్బంది ముత్తయ్య, మధు, వెంకటయ్య, యాచారం నవీన్ పాల్గొన్నారు.


వాటర్ ఫిల్టర్‌ను బహూకరిస్తున్న జితేంద్రగిరి

మహాసభలను జయప్రదం చేయాలి

నకిరేకల్ : దేశ వ్యాప్తంగా జరుగుతున్న మానవ హక్కుల ఉల్లంఘనను నిరసిస్తూ ప్రజాస్వామ్య బద్ధంగా జరుగుతున్న పోరాటాలకు సంఘీభావం తెలుపుతూ డిసెంబర్ 14, 15 తేదీల్లో అనంతపురంలో నిర్వహించే హెచ్‌ఆర్‌ఎఫ్ (హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్) రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు అక్కెనపల్లి వీరస్వామి పిలుపునిచ్చారు. శనివారం పట్టణంలో మహాసభలకు సంబంధించిన పోస్టర్లను సంఘం నాయకులతో కలిసి ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో సంఘం సహాయ కార్యాదర్శి సీహెచ్ కాశీరాం, రైతుకూలీ సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు బొల్లికొండ లింగయ్య, సీహెచ్ వెంకటాద్రి, వంటిపాక సుందర్, మండల కృష్ణ, ఆరోగ్యం, రవి తదితరులు ఉన్నారు.


పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

సమస్యలపై రాజీలేని పోరాటం పీఆర్‌టీయూదే

మిర్యాలగూడ టౌన్ : ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలతో పాటు సమస్యల పరిష్కారానికి రాజీలేని పోరాటాలను నిర్వహించే ఏకైక ఉపాధ్యాయ సంఘం పీఆర్‌టీయూ టీఎస్ మాత్రమేనని మాజీ శాసనమండలి సభ్యులు బట్టాపురం మోహన్‌రెడ్డి, జిల్లా పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షులు ఫణికుమార్ అన్నారు. శనివారం స్థానిక అభ్యాస్ టెక్నో స్కూల్‌లో నిర్వహించిన డివిజన్ స్థాయి పీఆర్‌టీయూ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఉపాధ్యాయులు కోసం అనేక జీఓలు, మహిళా ఉపాధ్యాయులు చైల్డ్ కేర్, మెటర్నిటి సెలవులు ఇలా అనేక సమస్యల పరిష్కరించడంలో ముందుందన్నారు. ప్రస్తుతం పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షులుగా ఉన్న శ్రీపాల్‌రెడ్డి నాయకత్వంలో ఉపాధ్యాయులకు ప్రమోషన్లు, బదిలీలు వంటి వాటిలో కీలక భూమిక పోషించడం జరిగిందన్నారు. ఉపాధ్యాయులందరు శ్రీపాల్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలన్నారు. పీఆర్‌టీయూ అర్బన్ శాఖ అధ్యక్షులు మునగాల రాంరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో పీఆర్‌టీయూ మాజీ జిల్లా అధ్యక్షులు భిక్షం గౌడ్, మండల విద్యాధికారులు బాలాజీనాయక్, లక్ష్మణ్‌నాయక్, రవినాయక్, నాయకులు నర్సింహ్మానాయక్, గోపి, కాశయ్య, యాదగిరిరెడ్డి, సుదర్శన్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రమేష్, గోవర్ధన్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, అశోక్, సైదిరెడ్డి, కిశోర్, రంగారెడ్డి, శ్రీనివాస్, నిరంజన్‌రెడ్డిలతో పాటు వివిధ మండలాల పీఆర్‌టీయూ నేతలు పాల్గొన్నారు.

ఎంపీడీఓకు వినతి

కేతేపల్లి : మండలంలోని కొర్లపహాడ్‌లో గల ప్రభుత్వ మోడల్‌స్కూల్‌లో కిచెన్‌షెడ్ నిర్మించాలని కోరుతూ పీఆర్‌టీయూ నాయకులు శనివారం ఎంపీడీఓకు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడారు. కిచెన్ షెడ్ లేకపోవడంతో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం చెట్లకిందనే వండడంతో ఆహారం కలుషితమయ్యే ప్రమాదం ఉందన్నారు. విద్యార్థుల ఆరోగ్యాలను దృష్టిలో పెట్టుకొని వంటగదిని నిర్మించి సమస్యను పరిష్కరించాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో పీఆర్‌టీయూ అధ్యక్షుడు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి జెల్ల రమేశ్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు గుడిపల్లి కుశలవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


ఎంపీడీఓకు వినతిపత్రం అందజేస్తున్న పీఆర్‌టీయూ నాయకులు